రేషన్..పరేషాన్

ఈ అవ్వ మూడు కిలోమీటర్లు నడవాల్సిందేనా..



ఇక్కడ చిత్రంలో కనిపిస్తున్న వృద్ధురాలి పేరు పెంచలమ్మ. మండల కేంద్రం శిరివెళ్లకు మజరా గ్రామమైన వెంకటేశ్వరపురం. గతంలో రేషన్ తెచ్చుకోవాలంటే 3 కి.మీ. పైగా దూరంలో ఉన్న శిరివెళ్లకు వెళ్లేది. వర్షం వచ్చినా, ఎండ మండినా వెళ్లి తెచ్చుకోక తప్పేది కాదు. అయితే, ఐదేళ్లుగా రేషన్ బండి ఇంటి ముందుకు వచ్చి సరుకులు అందజేయడంతో వృద్ధాప్యంలో బాధలు తప్పాయని ఆనందపడింది. ఇప్పుడు ఎండీయూ వాహనాలు నిలిపివేస్తున్నట్లు సర్కారు ప్రకటన చేయడంతో ఆమెలో ఆందోళన మొదలైంది. గ్రామం నుంచి శిరివెళ్లకు వెళ్లడానికి ఆటోలు, బస్సు సౌకర్యం ఏమాత్రం లేదని కాలినడకన ఈ వయస్సులో ఎలా వెళ్లి తెచ్చుకోవాలని పెంచలమ్మ ఆవేదన చెందుతోంది.

ఈమెకు మళ్లీ నెత్తిమోత తప్పదా..



ఇంటిముందే బియ్యం వేయించుకుని వెళ్తున్న ఈమె తులసమ్మ. బాచేపల్లె మజరాలోని తండా. సుమారు యాభైఏళ్ల నుంచి రేషన్ సరుకులను తెచ్చుకోవాలంటే 5 కి.మీ దూరంలోని బాచేపల్లెకు వెళ్లాల్సి వచ్చేది. రవాణా సౌకర్యం లేక పోవడంతో పాటు రహదారి కూడా సక్రమంగా ఉండేది కాదు. వర్షం వస్తే మూడు వాగులు, వంకల్లో నెత్తిన బియ్యం పెట్టుకుని ఈదుకుంటూ వచ్చిన కాలాలు అనేకం. అయితే, గత ఐదేళ్లుగా ఇంటి వద్దకే వచ్చి నిత్యావసర సరుకులు ఇస్తుండటంతో ఎలాంటి ఇబ్బంది లేకుండా జీవనం కొనసాగిస్తోంది. ప్రస్తుతం వాహనాలను తీసేశారని తెలియడంతో ఈ వయస్సులో నేను ఐదు కిలోమీటర్లు వెళ్లి ఎలా తెచ్చుకోవాలి అని ఆందోళన వ్యక్తం చేస్తోంది.

- ఇంటింటికీ రేషన్ పంపిణీకి కూటమి సర్కారు మంగళం
- ఎండీయూ వాహనాల ఉపసంహరణ
- మునుపటిలా రేషన్‌షాపునకు వెళ్లి పడిగాపులు కాయాల్సిన దుస్థితి
- ఆందోళనలో కార్డుదారులు
- గత ఐదేళ్లూ గడప వద్దే రేషన్ అందజేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- ఉపాధి కోల్పోనున్న ఎండీయూ ఆపరేటర్లు
- రేషన్ దుకాణాలు లేని మజరా గ్రామాలు, తండాలు, గూడేల లబ్ధిదారులకు తప్పని ఇక్కట్లు

ఆళ్లగడ్డ/నంద్యాల (అర్బన్): వైఎస్ జగన్‌పాలనలో ఐదేళ్ల పాటు ఎలాంటి చీకుచింత లేకుండా ఇళ్ల వద్దే రేషన్ అందుకున్న పేదలకు మళ్లీ రేషన్ కష్టాలు మొదలుకానున్నాయి. అధికారంలోకి వచ్చిన రెండునెలల్లోనే ఇంటింటికీ రేషన్ పంపిణీ విధానాన్ని కూటమి సర్కారు మంగళంపలికింది. దీంతో మునుపటిలా పేదలు పనులు మానుకుని కిలోమీటర్లు నడిచి రేషన్ సరుకులు నెత్తిన పెట్టుకుని తెచ్చుకోవల్సిన దుస్థితి ఎదురవుతుంది.

నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లో ఎక్కువగా కొండకింద పల్లెలైనా తండాలు, చెంచుగూడేలు, మజరా గ్రామాలు, పట్టణ శివారు కాలనీలు ఉన్నాయి. ఇప్పుడు కూటమి సర్కారు తీసుకున్న నిర్ణయంతో ఆయా ప్రాంతాల్లో నివసించే వారు రేషన్ తీసుకెళ్లాలంటే కనీసం 3 నుంచి 7 కి.మీ దూరంలోని రేషన్ దుకాణాలవద్దకు రావల్సి ఉంటుంది. తండా, గూడేలకు బస్సు, ఆటో సౌకర్యం ఉండదు. వచ్చే నెల నుంచి రేషన్ బండి ఇక ఇంటికి రాదనే విషయం తెలియడంతో అక్కడ నివసించే వారు మళ్లీ తమకు కాలినడక, డీలర్‌షాపు వద్ద పడిగాపులు తప్పవని ఆందోళన చెందుతున్నారు.

రోడ్డున పడనున్న ఆపరేటర్లు, హెల్పర్లు

ప్రతి కార్డు దారుడికి వారి సొంత పనులకు ఆటంకం కలగకుండా ఇంటి వద్దనే రేషన్ సరుకులు అందించాలన్న లక్ష్యంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2021లో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇంటింటికీ రేషన్ అందించే ప్రక్రియ ద్వారకా కార్డుదారులకు శ్రమ తగ్గడమే కాకుండా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడం జరిగింది. నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లో మొత్తం 112 ఎండీయూ వాహనాలున్నాయి. వాహనానికి ఇద్దరు చొప్పున ఆపరేటర్లు, హెల్పర్లుగా 224 మందిని నియమించి నెలకు రూ. 21 వేలు అందిస్తున్నారు. వీరు రెండు, మూడు దుకాణాల పరిధిలోని కార్డుదారులకు ఉదయం 7 నుంచి రాత్రి 9 గంటల వరకు నిత్యావసరాలను అందిస్తూ వచ్చారు. అనేక మంది ఆపరేటర్లు, హెల్పర్లు దీన్నే జీవనాధరంగా చేసుకుని కుటుంబాలను పోషించుకుంటున్నారు. అయితే, ప్రభుత్వం ఎండీయూ వాహనాల నిలిపివేస్తే ఈ 224 కుటుంబాలు రోడ్డున పడే దుస్థితి ఏర్పడుతుంది.



బాచేపల్లి తండాలో ఎండీయూ వాహనంతో రేషన్ సరుకుల పంపిణీ దృశ్యం



గతంలో ఆళ్లగడ్డ పట్టణంలో రేషన్ కోసం దుకాణం దగ్గర పడిగాపులు (ఫైల్)

ఆళ్లగడ్డ నియోజకవర్గం రేషన్ దుకాణాలు, కార్డుదారులు, ఎండీయూ వాహనాల వివరాలు

మండలం	రేషన్ షాపులు	రేషన్ కార్డులు	ఎండీయు వాహనాలు
ఆళ్లగడ్డ	55	25,604	16
చాగలమర్రి	39	16,059	11
దొర్నిపాడు	19	8,476	06
రుద్రవరం	39	15,451	09
శిరివెళ్ల	41	18,516	08
ఉయ్యాలవాడ	24	8,420	05
మొత్తం	217	92,526	55
నంద్యాల నియోజకవర్గంలో			
నంద్యాల (అర్బన్)	9347	849	37
నంద్యాల (రూరల్)	4724	148	12
గోస్పాడు	3312	431	8
మొత్తం	17384	428	57

జీవనోపాధి పోతుంది



నేను బాచేపల్లి గ్రామంతో పాటు మజరా గ్రామాలైనా కొండంపల్లె, తండాల్లోని సుమారు 2 వేల కార్డుదారులకు ప్రతినెల రేషన్ సరుకులుఅందజేస్తున్నాను. ఆ గ్రామాల్లోని వారందరూ పనులకు వెళ్లే వారు కావడంతో తెల్లవారు జామున లేదా పనుల నుంచి ఇంటికి వచ్చిన తర్వాత ఇంటింటికీ వెళ్లి సరుకులు అందిస్తున్నాను. నాకు నెలకు రూ 12 వేలదాక ఆదాయం రావడంతో పాటు వారు చూపించే ప్రేమ, ఆప్యాయతలు చాలా సంతోషంగా అనిపించేవి. ఇప్పుడు వాహనాలను తొలగించడం ద్వారా తండ, కొండపల్లె గ్రామాల్లోని కార్డుదారులు అనేక ఇబ్బందులు పడటంతో పాటు నేనూ ఉపాధి కోల్పోవలసి వస్తుంది.

– పుల్లయ్య, ఎండీయూ ఆపరేటర్

ఎండీయూ వాహనాలను కొనసాగించాలి



గత ప్రభుత్వం అమలు చేసిన ఇంటివద్దే రేషన్ పథకాన్ని కొనసాగించాలి. ఎండీయూ వాహనాల ద్వారానే రేషన్ బియ్యం అందజేయాలి. దీని ద్వారా దివ్యాంగులు, వృద్ధులకు ఎంతో మేలు జరుగుతుంది. రేషన్ షాపు వరకూ వెళ్లే తిప్పలు తప్పుతుంది. ప్రస్తుత ప్రభుత్వం పునరాలోచన చేసి ఎండీయూ వాహనాలను కొనసాగించాలి.

–భాస్కరమ్మ, నూనెపల్లె, నంద్యాల

బియ్యం ఇంటి వద్దే అందజేయాలి



రేషన్ సరుకులను ఎండీయూ వాహనాల ద్వారా ఇంటివద్దే అందజేయాలి. రేషన్ దుకాణాల వద్ద సరుకులిస్తే గంటల తరబడి క్యూలో నిల్చోవాల్సి వస్తుంది. ఒక్కోసారి కూలీ పనులు కూడా వదులుకోవాల్సి వస్తుంది. ఆసరాలేని వృద్ధులు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడతారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఇంటింటికీ రేషన్ విధానాన్ని కొనసాగించాలి.

–చెన్నయ్య, పసురపాడు, గోస్పాడు

తలపై మోత తప్పదు



50 సంవత్సరాలకు పైగా మా గ్రామంలో అందరం రేషన్ బియ్యం కోసం ప్రతి నెల ఐదు కిలోమీటర్లు నడుచకుంటూ చాకరాజువేముల గ్రామానికి వెళ్లి తెచ్చుకునే వాళ్లం. వైఎస్సార్ ప్రభుత్వం వచ్చాక ఇంటి వద్దనే సరుకులను అందిస్తుండటంతో పనులకు ఆటంకం లేకుండా ఉండేది. ఇప్పుడు మళ్లీ చాకరాజువేముల వెళ్లి తెచ్చుకోవాలని చెబుతున్నారు. అప్పటిలా మళ్లీ ప్రతి నెల 5 కి.మీ నడక, మోత తప్పేలా లేదు.

–నాగేంద్ర, వెంకటేశ్వనరగం, దొర్నిపాడు

నానా ఇక్కట్లు పడేవాళ్లం



నాకు ఊహ తెలిసినప్పటి నుంచి స్టోరులో బియ్యం కోసం 5 కి.పీ నడుచుకుంటూ బాచేపల్లి వెళ్లేవాళ్లం. అక్కడ స్టోర్ డీలర్ లేకుంటే ఆ రోజు వెనక్కి వచ్చేవాళ్లం. ఇలా ఐదారు రోజులు తిరిగిన సంఘటనలు ఉన్నాయి. తిరిగిన రోజుల్లో కూలి పోతుంది. పనిచేసుకుని బతికే మాకు పస్తులు ఉండాల్సి వచ్చేది. ఐదేళ్ల నుంచి ఇంటికే స్టోర్ బియ్యం వస్తుండటంతో మా పనులకు ఎలాంటి ఇబ్బంది కలగడం లేదు. మరి ఇప్పుడు పాత విధానం వస్తే ఏం చేయాలో తోచడం లేదు.

– సుబ్రం నాయక్, బాచేపల్లితండా, ఆళ్లగడ్డ

క్లుప్తంగా

జీవ వైవిధ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలి



విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): జీవ వైవిధ్య పరిరక్షణలో యువత భాగ స్వామ్యం కావాలని జిల్లా సైన్స్ కో ఆర్డినేటర్ కేవీ సుబ్బారెడ్డి అన్నారు. సోమవారం ఈ అంశంపై నంద్యాల బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. 120మంది విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. అనంతరం విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. వక్తృత్వ పోటీల్లో మొదటి బహుమతి సాయి వర్షిణి, నిశాంత్‌నాయక్, చైతన్య, వ్యాసరచన పోటీల్లో సుధీరా, నాగమౌనిక, శ్రావణి, క్విజ్ పోటీల్లో శివలోహిత్, బాలసిద్దయ్య, అనిసిటాబాయి, మానిక్, ఈశ్వర్‌నాయక్, శ్రీనివాస నాయక్ విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో ఎస్‌జీసీ జిల్లా కో ఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ పద్మావతి, దీక్ష కో ఆర్డినేటర్ నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం



వినతులు స్వీకరిస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల(సెంట్రల్): ప్రజా సమస్యల తక్షణ పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు మన బాధ్యత కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఆయన కార్యాలయంలో మన ఊరు–మన బాధ్యత కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



ప్రతిజ్ఞ చేస్తున్న సీఐ, చైర్మన్

నంద్యాల(న్యూటౌన్): డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువత భాగస్వామ్యం కావాలని ట్రాఫిక్ సీఐ షేక్ ఇస్మాయిల్, రామకృష్ణ విద్యా సంస్థల అధినేత రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం రామకృష్ణ అటానమస్ డిగ్రీ కళాశాలలో విద్యార్థినీ విద్యార్థులతో డ్రగ్స్ నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనదేశం ప్రపంచ దేశాలతో పోటీ పడుతూ అభివృద్ధిని సాధిస్తుందన్నారు. ఈ సమయంలో విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కాకుండా ఉండాలన్నారు. దేశ రక్షణ, ధర్మరక్షణలో భాగస్వాములు కావాలన్నారు. ప్రిన్సిపాల్ సుబ్బయ్య, అధ్యాపకులు లలితాసరస్వతి, డాక్టర్ బాలసుబ్రమణ్యం, రమణమ్మ, కృష్ణవేణి, మహేష్‌గుప్తలు పాల్గొన్నారు.

ఘనంగా హర్ ఘర్ తిరంగా



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: స్వాతంత్ర వేడుకల్లో భాగంగా ఆజాదీకా అమృత మహోత్సవం ×హర్ ఘర్ తిరంగా× కార్యక్రమం సోమవారం ఆళ్లగడ్డ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణ నుంచి పాత బస్టాండ్ వరకు జాతీయ జెండాలతో భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం అక్కడ మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పట్టణ ఎస్ఐ నగీన, ప్రైవేటు పాఠశాల సంఘం డివిజన్ అధ్యక్షుడు అమీర్ బాషా మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటం, సమరయోధుల గురించి వివరించారు.

కుష్టు అనుమానిత కేసుల గుర్తింపు

చాగలమర్రి: స్థానిక పీహెచ్‌సీ పరిధిలో ఇప్పటి వరకు నిర్వహించిన సర్వేలో 256 కుష్టు వ్యాధి అనుమానిత కేసులను గుర్తించినట్లు జిల్లా పారా మెడికల్ అధికారి రమణ తెలిపారు. సోమవారం ఆయన పీహెచ్‌సీలో అనుమానిత కుష్టు వ్యాధి కేసులను పరీక్షించారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి పి.అంజలి, నోడల్ పర్సన్ రామలింగారెడ్డి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రణాళికలు నిర్వహించాలి

గోస్పాడు: గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికను సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీఓ నాగ అనసూయ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు మూడు రోజుల శిక్షణను ఆమె సోమవారం ప్రారంభించి మాట్లాడారు. పంచాయతీ విధులు, బాధ్యతలను తెలుసుకోవాలన్నారు. ఎంఈఓ అబ్దుల్‌కరీం పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రధానం

- నర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శుల శిక్షణలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ

నంద్యాల(అర్బన్): దేశ పురోగతికి గ్రామాలు అభివృద్ధే ప్రధానమని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి అన్నారు. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ భవనంలో సోమవారం గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ఆర్‌జీఎస్‌ఏ కార్యాచరణ ప్రణాళికపై మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డీపీఓ మంజులవాణి ముఖ్య అతిథిగా హాజరైన కార్యక్రమంలో డిప్యూటీ జెడ్పీ సీఈఓ మాట్లాడుతూ పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, తదితరాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వం గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళ్తుందని, శిక్షణ అనంతరం మీరు ఆ దిశగా దృష్టి సారించాలని సర్పంచులు, కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుగుణశ్రీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి

బాధ్యతలు, విధులు తెలుసుకోవాలి

ఉయ్యాలవాడ/దొర్నిపాడు/రుద్రవరం/శిరివెళ్ల/చాగలమర్రి: గ్రామ పంచాయతీల యొక్క విధులు, బాధ్యతలు సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు తప్పని సరిగా తెలుసుకోవాలని మండల అధికారులు సూచించారు. సోమవారం గ్రామాల అభివృద్ధిపై నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. గ్రామాల్లో ఉపాధిహామీ పథకం, పింఛన్ల పంపిణీ, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, భూమి మరియు నీటి సంరక్షణ, వ్యవసాయ క్షేత్రాల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. పల్లెల అభివృద్ధి ప్రణాళికలపై ప్రజా ప్రతినిధులకు అధికారులు అవగాహన కలిపించారు. ఈ శిక్షణ కార్యక్రమాల్లో ఆయా మండలాల ఎంపీడీఓలు, ఎంపీపీలు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ట్రైన్‌లో బంగారు ఆభరణాల చోరీ

బొమ్మలసత్రం: కాచిగూడ ట్రైన్‌లో గుర్తుతెలియని దొంగలు బ్యాగులో ఉన్న 8 తులాల బంగారు ఆభరణాలు దోచుకెళ్లిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. రైల్వే ఎస్ఐ జలీల్ తెలిపిన వివరాల మేరకు.. హైదరాబాద్‌కు చెందిన అరుణశ్రీ, శివశంకర్లు దంపతులు. వీరు ప్రకాశం జిల్లా మార్కాపురంలో సమీప బంధువుల ఇంట్లో శుభకార్యానికి కాచిగూడ రైలులో హైదరాబాద్ నుంచి బయలుదేరారు. సోమవారం వేకువజామున రైలు నంద్యాలకు చేరుకున్న తర్వాత దంపతులు నిద్ర నుంచి మేల్కొని బ్యాగ్ వైపు చూడగా కనిపించలేదు. అందులో 8 తులాల బంగారు ఆభరణాలు ఉండటంతో వెంటనే తమకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నాటుసారా విక్రేత అరెస్టు

రుద్రవరం: హరినగరం గ్రామానికి చెందిన శ్రీనివాసులు అనే నాటుసారా విక్రేతను సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడు ఆహోబిలంలో తక్కువ ధరకు సారా కొనుగోలు చేసి హరినగరంలో అధిక ధరకు విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో వారు దాడి చేశారు. ఐదు లీటర్ల నాటుసారాతో నిందుతుడు పట్టుబడగా కేసునమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఏఎస్ఐ శోభన్‌బాబు తెలిపారు.

145 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం




పట్టుబడిన రేషన్ బియ్యం మినీలారీ

బొమ్మలసత్రం: నంద్యాల జిల్లా కేంద్రంలోని ఆటో నగర్‌లో సోమవారం అక్రమంగా లారీలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని తాలూకా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ దస్తగిరిబాబు తెలిపిన వివరాల మేరకు.. వెల్దుర్తి పట్టణానికి చెందిన శోభన్‌బాబు నంద్యాల పరిసర ప్రాంతాల్లో 145 బస్తాల రేషన్ బియ్యాన్ని సమీకరించాడు. సరకును ఆటో నగర్ సమీపంలోని రహస్యప్రాంతంలో దాచి చాకలి మధుకు చెందిన మినీలారీలో ఎక్కించాడు. తర్వాత కర్ణాటక రాష్ట్రానికి తీసుకెళ్తుండగా వెంకటేశ్వరాపురం జాతీయరహదారి వద్ద పోలీసులు తనిఖీ చేసి పట్టుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, బియ్యాన్ని సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు.

స్పోర్ట్స్

కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థినులతో పీఈటీ సరళ

దొర్నిపాడు: ఈనెల 10, 11 తేదీల్లో గార్గేయపురంలో జరిగిన 7వ రాష్ట్రస్థాయి రోప్‌స్కిప్పింగ్ చాంపియన్‌షిప్‌లో స్థానిక కస్తూరిబాగాంధీ విద్యాలయం విద్యార్థినులు ప్రతిభ చూపి బంగారు పతకం సాధించారు. అండర్–12 విభాగంలో సుమాంజలి బంగారు పతకం, రుక్మిణి, ఝాన్సీలు సిల్వర్, అండర్–14 విభాగంలో చరిత వెండి, మౌనిక కాంస్యం, అండర్–17లో లావణ్య సిల్వర్ మెడల్‌ను సాధించారు. పీఈటీ సరళ, విద్యార్థులను ఎస్ఓ జయమణి అభినందించారు. జాతీయస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

తాడు ఆట పోటీల్లో రాణింపు

రుద్రవరం: స్థానిక కేజీబీవీ విద్యార్థులు ఆదివారం గార్గేయపురంలో జరిగిన రాష్ట్రస్థాయి తాడు ఆట పోటీల్లో ప్రథమ స్థానంలో 10మంది, ద్వితీయ స్థానంలో మరో 10మంది బాలికలు నిలిచి పతకాలు సాధించారు. వారిని సోమవారం కేజీబీవీ పాఠశాలలో ఎస్ఓ లక్ష్మీదేవితో పాటు ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

29న క్రీడా దినోత్సవం

నంద్యాల(న్యూటౌన్): హాకీ ప్లేయర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ఈనెల 29వ తేదీన జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించాలని డీఈఓ సుధాకర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజున క్రీడలు, ఆటల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మొదటి 5 పాఠశాలలను గుర్తించి వాటిలో జిల్లా స్థాయి క్రీడా దినోత్సవ వేడుకలు నిర్వహించాలన్నారు. అలాగే జిల్లా స్థాయిలో స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ టైటిల్‌ను ప్రదానం చేస్తారని ఇందుకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

సంక్షిప్తం

రైతులకు నష్టపరిహారమివ్వాలి

నంద్యాల(న్యూటౌన్): డోన్ మండలం ఇందిరాం పల్లె గ్రామంలో పంట పొలాల్లో గడ్డి మందు చల్లి నాశనం చేసిన వారిపై చర్యలు తీసుకొని బాధిత రైతులకు నష్టపరిహారం అందజేయాలని సీపీఐ రంగనాయుడు, బాబాఫక్రుద్దీన్ కోరారు. ఈ అంశంపై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.

20న డీ వార్మింగ్ డే

దొర్నిపాడు: ఈనెల 20న డీ వార్మింగ్ డే నిర్వహిస్తున్నట్లు డబ్ల్యూ కొత్తపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి భార్గవి తెలిపారు. ఆ రోజు 1నుంచి 19 ఏళ్లలోపు విద్యార్థులందరూ ఆల్‌బెండజోల్ మాత్రలను విధిగా వేసుకునేలా ఉపాధ్యాయులు, గ్రామ ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని సోమవారం ఓ ప్రకటనలో కోరారు.

ఆలయంలో అన్నదానం

నంద్యాల(వ్యవసాయం): స్థానిక బంగారు పుట్ట దేవస్థానంలో భద్రకాళి పీఠాధిపతి సింధు మాతాజీ జన్మదినాన్ని పురస్కరించుకొని సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ, అన్నదానం కార్యక్రమం నిర్వాహకులు వినోద్‌కుమార్, వెంకట్, సుబ్బనర్సయ్య, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ఉయ్యాలవాడ : ప్రజా సమస్యలకు సత్వరమే పరిష్కారం చూపాలని ఎంపీడీఓ ఉమామహేశ్వర రావు, తహసీల్దార్ శ్రీనివాసులు వివిధ శాఖల మండల అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక రెవెన్యూ, మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొని వారు మాట్లాడారు. ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏఈ గురప్ప, డిప్యూటీ తహశీల్దార్ తులసికృష్ణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దీప్తి, తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల సర్దుబాటు ప్రక్రియ రద్దు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): టీచర్ల సర్దుబాటు ప్రక్రియను వెంటనే రద్దు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి శివయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ జీవో 117ను వెంటనే రద్దు చేసి 3, 4, 5 తరగతులను ప్రాథమిక పాఠశాలలో కొనసాగించాలని కోరారు. హెచ్‌ఎం పోస్టులను విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా కొనసాగించాలన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు దస్తగిరి బాషా, నాయకులు రంగ నాయకులు, ఆదినారాయణ, పుల్లయ్య, లక్ష్మీ నారాయణ, సైపుల్లా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలి

శిరివెళ్ల: విద్యార్థులను శాస్త్ర వేత్తలుగా తయారు చేయాలని డిప్యూటీ డీఈఓ మహబూబ్‌బేగ్ అన్నారు. సోమవారం గోవిందపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో అటల్ రింకరిన్ ల్యాబ్ రాయసీమ వర్క్ షాప్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ల్యాబ్‌లపై సైన్స్ టీచర్లుకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ప్రాంతీయ వర్క్ షాప్‌లను ఏర్పాటు చేసిందన్నారు. గోవిందపల్లెలో 2019లో ల్యాబ్ మంజూరయిందన్నారు. ల్యాబ్ హబ్‌గా పాఠశాల కొనసాగుతుందన్నారు. వర్క్ షాప్‌లో నేర్చుకున్న అంశాలను టీచర్లు తిరిగి పాఠశాలలో విద్యార్థులకు తెలియజేసి నూతన ఆవిష్కరణల వైపు నడిపిస్తారన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ వర్క్ షాప్‌నకు 9 జిల్లాల నుంచి 27 మంది టీచర్లు హాజరయ్యారు. కార్యక్రమంలో యూనిసెఫ్ కో– ఆర్డినేటర్ సుదర్శన్, ఎంఈఓ శంకర్‌ప్రసాద్, హెచ్‌ఎం బాలనాగిరెడ్డి, హబ్ నోడల్ టీచర్ నరసింహయ్య పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగు లాభదాయకం



పండ్లతోటలను పరిశీలిస్తున్న అంబుడ్స్ పర్సన్

ఆళ్లగడ్డ: పండ్ల తోటల సాగు రైతులకు లాభదాయకమని డ్వామా అంబుడ్స్ పర్సన్ సురేంద్ర అన్నారు. ఉపాధి హామీ పథకం కింద రైతులు సాగు చేసిన మామిడి, నిమ్మ తదితర పండ్ల తోటలను సోమవారం ఆయన పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండ్ల తోటల సాగుకు ఆసక్తి చూపే రైతులకు ప్రభుత్వం 100 శాతం సబ్సిడీపై ప్రోత్సాహం అందిస్తుందన్నారు.

ఉయ్యాలవాడ : వ్యవసాయానికి అనుబంధంగా సన్న, చిన్న కారు రైతులు పండ్ల తోటలు సాగు చేస్తే ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చునని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం రాజమండ్రి నుంచి మండలానికి చేరిన వివిధ రకాల పండ్ల మొక్కలు, కొబ్బరి మొక్కలను 45 మంది రైతులకు పంపిణీ చేశారు. 62 ఎకరాల్లో మొదటి విడతగా ఆ మొక్కలు నాటేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఏపీఓ రవిప్రకాష్ తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

రుద్రవరం: తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని అంగన్‌వాడీ ఉద్యోగులు డిమాండ్ చేశారు. సోమవారం వారు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో తహసీల్దార్ మల్లికార్జునరావును కలిసి డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు.

చాగలమర్రి: అంగన్‌వాడీ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, వేతనాలు పెంచి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రకళ డీటీ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

16 నుంచి రెవెన్యూ గ్రామ సభలు

శిరివెళ్ల: మండలంలో ఈ నెల 16వ తేదీ నుంచి రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ పుష్పకుమారి సోమవారం తెలిపారు. 16వ తేదీన మహదేవపురం గ్రామ సచివాలయంలో, 20న గుండంపాడు, 23న బోయలకుంట్ల, 27న గంగవరం, 29న చెన్నూరులో సభలుంటాయన్నారు.

సెప్టెంబర్ 3వ తేదీన గోవిందపల్లె, 5న కామినేనిపల్లె, 10న కోటపాడు, 12న జీనేపల్లె,17న వనికినిదిన్నె, 20న గుంప్రమాన్‌దిన్నె, 24న యర్రగుంట్ల, 26న శిరివెళ్లల్లో రెవెన్యూ సభలుంటాయన్నారు. భూ సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామన్నారు.

ప్రమాదకరంగా నూతన జాతీయ విద్యావిధానం

నంద్యాల(న్యూటౌన్): నూతన జాతీయ విద్యావిధానం విద్యారంగానికి ప్రమాదకరంగా మారిందని ఏఐఎస్‌ఎఫ్ జాతీయ మాజీ అధ్యక్షుడు మురళీధర్ అన్నారు. సోమవారం ఏఐఎస్‌ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక సీపీఐ కార్యాలయం ఎదుట ఏఐఎస్‌ఎఫ్ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కొత్తగా ప్రభుత్వ విద్యాసంస్థల స్థాపన కోసం, విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి విద్యార్థి సంఘం నాయకులు నిరంతరం పోరాటం చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలపై ఉద్యమాలకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రంగనాయుడు, జిల్లా కార్యదర్శి ధనుంజయుడు, నాయకులు సురేష్, ఎర్రిస్వామి, సీపీఐ సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం కావాలి

శిరివెళ్ల: మండలంలో ఇళ్ల నిర్మాణాల వేగవంతం చేయాలని హౌసింగ్ డీఈ నాగరాజు అన్నారు. సోమవారం స్థానిక హౌసింగ్ కార్యాలయంలో మండల ఇళ్ల నిర్మాణాల పురోగతిని సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ నియోజక వర్గానికి గత ప్రభుత్వం 9,662 పక్కా గృహాలను మంజూరు కాగా ఇంత వరకు 5,476 ఇళ్ల నిర్మాణాలు పూర్తి అయ్యాయన్నారు. మిగతా వాటిని కూడా త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈ నాగేశ్వర్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.